# నవ్వు బాంబు

కథకుడు :

మధునా పంతుల

ఆ వేళ లేచింది మొదలు నాకన్నీ అనుకోని సంఘటనలే జరిగేయి. లేచిన వెంటనే 'కేఫ్' కి వెళ్లడానికివీల్లేని పరిస్థితిలోవున్నా. అధైర్యపడి యీ పాడు జీతానికీ, జీతాన్ని మించిన ఖర్చులికి విసుగుచెందాను. యుద్ధము అయేవరకూ యిలాగే గడపాలి. తర్వాత బుర్రలోని మహదాశయాలికి రూపాన్ని తెద్దామనుకున్నా.

సిగరెట్ కూడా లేదు. నిండావున్న అగ్గిపెట్టె క్రితము రోజు నేకొన్నాను-ఖాళీసిగరెట్టుపెట్టెనిచూసి వెక్కిరిస్తోంది. నన్నుచూసి వెక్కిరించింది.

'షే' చెయ్యని కథలూ వ్యాసాలూ చూసి కంట నీరెట్టాను. పోనీ కిందటి సంవత్సరము నా కథలపోకడ యెలా నడిచిందీ చూద్దామని 'కథల కవర్'ని దులిపేను. ఎప్పుడో దాచేనో తెలీదు కాని పావలాకాసు కిందమోగింది. నా కడుపు కాఫీతోనిండింది. నాలుగు అగ్గిపుల్లలికి ఖర్చుతగిలింది.

భోజనానికి టిక్కెట్లు వుండనేవున్నాయి. ఒకటిక్కెట్టు ఖర్చుచేసి బీడానములుతూ ఆఫీసు చేరే టప్పటికి యెందుకో యెగకొట్టాలని బుద్ధిపుట్టింది. దొంగజబ్బుని ఆరోపించుకుని డి. యం. ఒ. దగ్గరికి వెళ్ళేసమయానికి గెడ్డాలుపెంచే ప్రభుత్వసేవకులు గుర్తుకొచ్చారు. గెడ్డము మాయలేదు కాని గతరాత్రి నిద్రలేమి నన్నో రోగిష్టిగానే ప్రదర్శిస్తోంది. సెలవు అడిగా. 'ఆల్ రైట్-గో అండ్ టేక్ రెస్ట్' అన్నారు మా అధికారి.

ఒక్క నిమిషములో లాడ్జిలోపడి బెడ్ పరిచి అయిదునిమిషాలు రోగిగానే పడుక్కున్నా. 'షే' చేసే కథకోసము ఆలోచించా. నాలుగు పేజీలు నడిచి ఊహాలు ఊరుకే బుర్ర ఊరుస్తున్న సమయములో కలముపాళీ చిట్లింది. రిలీఫ్ పాళీలకోసము పెట్టె అంతా సోదాజేసాను. పాళీ దొరకలేదు కాని కాఫీ పార్టీకి పిలిచేందుకు మాంబళమునుంచి మా మిత్రులు బాలకృష్ణరావుగారొచ్చారు 'ఆఫీసుకెళ్ళాన్ను మీరు కనిపించలేద'ంటూ.

సిగరెట్ పేకెట్ ముందుపడేసి నా పక్క మీద్దవాలేడు మా బాలకృష్ణరావు. ఇంతలోకే మరో మిత్రుడు నా గదిమీదకి దాడీజరిపాడు. 'రండి రామచంద్రరావుగారూ' అంటూ సిగరెట్టు అందిచ్చాను. ఒక్క అగ్గిపుల్లతో మూడుసిగరెట్లు వెలిగాయి. 'ఎకొనమీ' పేరుచెప్పుకుని శాస్త్రాన్ని ఉల్లంఘించాము.

ముగ్గురం కాఫీకి వెడదామనుకుని లేచేసరికి రామచంద్రరావు 'నేను భోజనానికిపోతాను—మీరు కాఫీకిపొండి' అన్నాడు. సరే అని యెదురు మలుపులోవున్న హోటల్లోదూరాము. అనుకున్నదొకటి జరిగిందొకటి. ఒక దోసె కాఫీతో లేద్దాం అనుకునేసరికి అవికాక పూరీలుకూర, టైర్ వడైతో అంతమైంది. సర్వర్ పచ్చటి కొంచెము తడిసిన కాగితంమీద పదకొండణాలకానీ అనివ్రాసి యిచ్చాడు. నేను పర్సుతియ్యటానికి నటించేలోగా బాలకృష్ణరావు రూపాయినోటు బల్లమీదపెట్టేడు. యజమాని యే దృష్టిలోవున్నాడో బాలకృష్ణరావు చేతిలోకి పన్నెండణాల ముక్కానీవచ్చింది. ఇవతలకొచ్చాక ఆశ్చర్యపడ్డాం. ఎందుకో కాదు—తప్పల్సి

పట్టే నేను-యెరుగుండి తీసినరావూ-సంయుక్త కార్యక్రమము అవటమువల్ల.

బైటకొచ్చాక 'ఇంతఅనుభవజ్ఞుడైన హోటల్ యజమాని బోల్తాపడ్డాడేమిటి' అన్నాడు బాలకృష్ణ.

'ఎర్రర్ యీజ్ హ్యూమన్ అన్నది నిజమే-' అన్నాడు బాలకృష్ణ.

'అయితే యేంచేద్దాము యిప్పుడు'

'విల్స్ పేకట్ కొనుక్కుందాం-పరిహారార్థం ధూపము'

విల్స్ సిగరెట్ ఊదుతూ 'అయితే మనము తిన్నదానికిఖరీదు మూడణాలకానీ అన్న మాట' అన్నాడు రావు.

'అవును కాని, తిన్నప్పుడులేదు కాని యిప్పుడు అర్ధరూపాయ టిఫిన్ బరువు కనిపిస్తోంది' అన్నా.

నవ్వలేక వొంగిపోయాడు రావు.

రామచంద్రరావు భోంచేసేక మేము కలుసుకున్నాం. జరిగింది చెప్పాము. అతనూ నవ్వలేక ఒంగిపోయాడు.

ఆవేళ రామచంద్రరావు దూరముగావున్న ఆత్మీయులకి పంపడానికి మద్రాసుఫలాలు, పుష్పాలూ కొన్నాడు. ఇంక బంగాళాదుంపలు వీశెడుకొనాలి, అదొక్కటే తరవాయి అంటే కొత్వాల్ బజార్‌కి పోయాము.

బంగాళాదుంపల కొట్టుదగ్గర రామచంద్రరావు తూనికపరీక్షలో నిమగ్నుడయితే నేనూ బాలకృష్ణ తెలుగుదేశాన్ని చూడడానికిపోతూన్న ద్రాక్షపళ్లని ఒక్కొక్కదాన్నే తిండంప్రారంభించాం. మా పని చూసి బంగాళాదుంపల వర్తకుడు వినోదిస్తున్నాడు. ఇంకో పదిఫలాలు దుంపలుకావాలి, అంటే అరవీశ




# మీ విధిని చక్కగా నిర్వహించడంలోని తృప్తి:

క్రమ ప్రణాళిక ననుసరించి జీవితభీమా చేయడంవల్ల మీకుటుంబంపట్ల మీకుగల బాధ్యతను నిర్వర్తించిన సంతృప్తి కలుగుతుంది. అది కుటుంబంలో ప్రశాంతి పెంపొందడానికి అమూల్యసాధనం.

అంతేకాదు, ప్రపంచంలో అనేకులు ఆకాంక్షించే అపూర్వమైన భాగ్యవిశేషాన్ని కలిగివున్న నిశ్చిత విశ్వాసాన్నికూడా అది కలిగిస్తుంది.

## యునైటెడ్ ఇండియా
## లైఫ్ అష్యూరెన్స్ కో., లిమిటెడ్,

యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్స్,
ఎస్ప్లనేడ్ :: మదరాసు.
బ్రాంచీలు, ఏజన్సీలు ఇండియాఅంతటావున్నవి.

తక్కువ యిచ్చేదిలేదని వర్తకుడు జవాబివ్వడంతో 'అయితే పోతాం' అని వెనకడుగువేశాము. నన్నూ బాలకృష్ణని మేము కనబడేవరకూ చూస్తూ వర్తకుడు నవ్వుతూనే వున్నాడు. మేము వెనక్కి చూసి ఆఖరి ద్రాక్షపళ్లని చప్పరించాము.

'ఏమిటిలాపళ్ళని మాయచేసేసారు' అన్నాడు రామచంద్రము.

'ఇంతకీ దుంపలఖరీదిచ్చావా?' అన్నాడు బాలకృష్ణ.

'అయ్యో—లేదు—' అని వెనక్కి అడుగు పెట్టబోయాడు రామచంద్రం.

'ఈ ఫర్లాంగుదూరమూ వెనక్కినడిచేకన్న ముందుకునడిస్తే కాఫీహోటల్ వస్తుంది' అన్నాడు బాలకృష్ణ.

'ఆ పన్నెండణాలకానీ యీ తొమ్మిదణాలు ఖర్చైపోవాలి' అన్నాడు తిరిగి బాలకృష్ణ. నేనూ అందుకు ఓటిచ్చాను.

'ఆ హోటల్‌కి వెడదాం' అన్నాడు రామచంద్రము.

'చాచా—ఒద్దండి' అన్నా.

'అక్కడ అరకప్పు' కొలతలున్నాయి'

'అన్యాయముగా వచ్చినలాభాన్ని కూడబెట్టుకుందామనా తలంపు'

'ఆ-ఆ-అయితే మా హోటల్‌కే వెడదాం'

'ఒద్దు-ఒద్దు-నేనూ యెప్పుడూ వెళ్ళలేదు కనుక మీ హోటల్‌కే వెడదాం' అన్నా.

కొత్తహోటల్‌లో అడుగుపెట్టాము-మాలాడ్జి అంతవుంది హోటల్. 'ఏమున్నాయ్ వేడిగా' అంటే సర్వర్ 'పెసరెట్ దోసె' అన్నాడు.

ఆసర్వర్ పలవరిస్తున్నాడా అని భ్రమపడి మళ్ళీ రెట్టించిఅడిగాము. 'పె-స-రె-ట్' అని స్పష్టముగాచెప్పాడు. స్వాతివాన-ముత్యపుచిప్పలు-తెలుగువాళ్లు-పెసరెట్లు-

మద్రాసులో పెసరెట్ తినాలని బుద్ధిపుట్టినప్పుడు యే ఆదివారంనాడో స్నేహితుడింట్లో పెసరట్లవారము చెప్పుకోవలసిందే—

అలాంటి 'డెలికసీస్' 'ఆబ్లిగేషన్స్' ఎక్కువైతే విలువలేదు. ఇన్నాళ్ళకి మద్రాసులో పెసరెట్ చేసే హోటల్ కనిపించడము అనుకోని సంఘటనే—

'ఏదో నక్కని తొక్కివచ్చాము' అనుకున్నాం. ఒకళ్ళంకాదు మా త్రిమూర్తులు.

రెండుసార్లు పెసరట్లకి ఆర్డరిచ్చి కాఫీ అర అని స్పష్టంగాచెప్పి బిల్ చూసేసరికి వీశెడు బంగాళాదుంపల లాభమూ వొదిలింది. ఈ హోటల్ యజమాని చాలా జాగ్రత్త అయినవాడనే అనుకున్నాం.

సరే యీవేళ అన్నీవింతలు జరుగుతున్నాయ్ కనుక 'కానూన్' కి పోదాం అనుకున్నాం. సెంట్రల్‌లో పళ్ళూ, దుంపలూ అందిచ్చి హాలుచేరేటప్పటికి ఒక్కొక్కళ్ళంపర్సులు తీసాం. నా అణన్నరలూ కలిస్తే టిక్కెట్లుమూడూ చేతిలోపడ్డాయి.


USE ALWAYS "DEER" BRAND SOAPS.

ఏదో సాకు చెప్పకపోతే సెలవు తీసుకోవడంలో బరువు వుండదని సాకుగా చెప్పిన 'కాన్స్టిపేషన్' బాధ నిజమైంది. అటు మూడణాలకొనీకే వచ్చిన నాలుగు విలువైన పదార్థాలూ, వీశెడు బంగాళాదుంపల విలువకితూగే కాఫీతో పెసరట్లు లోపలికి వెళ్ళి యేం చెయ్యకుండా వూరుకుంటాయా?

బాలకృష్ణకి ఫేన్ కోసం పలవరిస్తూంటాడు. వీధుల్లో ప్రతీ స్తంభానికీ దీపంతో బాటు ఒక ఫేన్ కూడా కార్పొరేషన్ వాళ్లు పారేస్తే ముందుగా చంక శేరేసేవాడు మా బాలకృష్ణ. సినిమాలో ఫేన్ వుంది. అంచేత కృష్ణబాధలేదు.

రామచంద్రరావుకి వాచీలపిచ్చి ఎక్కువ. సినిమాకథలో ఏదృశ్యంలోనైనా రిస్టువాచీలు, గోడ, బల్ల, వాచీలు కనిపిస్తే ఏఏకంపెనీల వాచీలో వల్లిస్తూంటాడు.

నేనీ రెంటి మనస్తత్వాలమధ్యా చిత్రాన్ని చూస్తూంటాను.

కానూన్ వదిలి బైటికివస్తున్నాం. జనం తోపుళ్ళలోనే 'యీ వేళ ఆవీధిలోని హోటల్ యజమానీ, బంగాళాదుంపల వర్తకులూ మన టోపీల్లో పడ్డారు, అందుకే సినిమాకి రాగలిగాం' అన్నా.

వెంటనే 'ఏమండీ' అన్నపిలుపు వినిపించింది.

మాకు గుండెలుజారాయి. ఎవరో కాదు ఆ హోటల్ యజమానే-'మీరు సినిమాకి రావడానికి మూడువంతులు సహాయపడ్డాను' అన్నాడు నవ్వుతూ.

హోటలాయనికి నవ్వేకాని మాకు ఒక బాంబు!!


# MADRAS ENAMEL WORKS LTD.,

65, SYDENHAM'S ROAD : : MADRAS.

●

*Approved by the Government of India (I. S. D.)*

Manufacturers of :

- ***SIGN BOARDS***
- ***HOUSEHOLD UTENSILS***
- ***HOSPITAL WARE***
- ***ELETRIC SHADES***

●

## Our Well Equipped Modern Factory

***Can meet all the Requirements of***

- ADVERTISERS
- DISTRICT BOARDS
- RAILWAYS
- MUNICIPALITIES
- HOSPITALS
- ARMYS &

GENERAL PUBLIC

Telegram :
**" ENAMELSIGN "**

★

Telephone :
**2646.**